సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలకు స్థల పరిశీలన

కలెక్టర్ హనుమంతరావుకు స్థలాన్ని చూపిస్తున్న యువజన క్రీడల శాఖ అధికారి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 15 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం నుంచి నిర్వహించే సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలకు స్థలాన్ని కలెక్టర్ హనుమంతరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలాన్ని అన్ని విధాలుగా క్రీడకారులకు అనుగుణంగా మార్చాలని యువజన క్రీడల శాఖ అధికారి ధనుంజనేయులుకు కలెక్టర్ సూచించారు. అనంతరం ధనుంజనేయులు మాట్లాడుతూ క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ పోటీల్లో మండల, మున్సిపాలిటీ పరిధిలోని బాలబాలికలు, పురుషులు, మహిళా క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం కబడ్డీ (ఉమెన్), వాలీబాల్ (బాలురు) బాస్కెట్‌బాల్ (మెన్), హ్యాండ్‌బాల్ (బాలికలు), 17న కబడ్డీ (ఉమెన్), వాలీబాల్ (బాలికలు), బాస్కెట్‌బాల్ (ఉమెన్), హ్యాండ్‌బాల్ (బాలురు), బేస్‌బాల్ (బాలురు), 18న ఫుట్‌బాల్ (మెన్, ఉమెన్, బాలురు), రెజ్లింగ్, సైక్లింగ్, మండల స్థాయి వాలీబాల్, ఆర్చరీ, చెస్, యోగా, నెట్‌బాల్, 19న ఖోఖో (మెన్, ఉమెన్), 20న అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, వీల్‌చైర్, బాస్కెట్‌బాల్, సైక్లింగ్, 21న ఫైనల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

ఏళ్లు గడస్తున్నా పూర్తికాని పీహెచ్‌సీ భవనం

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బంది పడుతున్న పేషెంట్లు

నిర్మాణ పనులు పూర్తికాని తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

చౌటుప్పల్, డిసెంబర్ 15 : అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అనే చందంగా మారింది తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పరిస్థితి. ఏండ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. నిధులు వచ్చాయి.. మందులు వస్తున్నాయి.. వైద్యాధికారులు, సిబ్బంది సైతం ఉన్నారు. అయినా.. కేంద్రం వినియోగంలోకి రావడం లేదు. ఇప్పటి వరకు సుమారు రూ.1.60కోట్లు మంజూరయ్యాయి. పనులు మాత్రం భవన నిర్మాణం వరకే పరిమితమయ్యాయి. భవనం లోపల అంతర్గత పనులు పూర్తి కాలేదు. దీంతో ఏండ్ల తరబడి ఈ కేంద్రం వినియోగంలోకి రావడం లేదు. విద్యుత్ లేదనే సాకుతో కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని వినిపిస్తుంది. విద్యుత్, ప్లంబర్, బండలు, కలర్లు తదితర పనులు పూర్తయితే పూర్తి స్థాయిలో వినియోగంలోకి రానుంది. కానీ.. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు దీని వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో పనులు ఏండ్ల తరబడిగా సాగుతున్నాయి. ఆరోగ్య కేంద్రం పూర్తయితే చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ప్రతి నెలా సుమారు 4వేల మందికి వైద్య సేవలు దరిచేరనున్నాయి.

పక్కా భవనం లేక తీవ్ర అవస్థలు

పక్కా భవనం పూర్తి కాకపోవడంతో ప్రస్తుతం ఈ సేవలు తంగడపల్లి పాత గ్రామ పంచాయతీ భవనంలోని రెండు ఇరుకు గదుల్లో అందిస్తున్నారు. తద్వారా రోగులతో పాటు వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా చిన్నాచితక వైద్య సేవలు అందించాల్సి వస్తుంది. ఏదైనా తీవ్ర ఇబ్బంది కలిగితే ఇతర ప్రభుత్వ దవాఖానలకు పంపాల్సిందే. ప్రధానంగా స్త్రీలకు ప్రత్యేక ల్యాబ్ గదులు లేవు. గర్భిణులకు పరీక్షలు చేసేందుకు సరైన సదుపాయాలు లేక ఇతర ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. సెలైన్ బాటిల్ ఎక్కించేందుకు ఎలాంటి సదుపాయమూ లేదు. వ్యాక్సినేషన్‌కు కూడా ఇబ్బందే. వ్యాక్సిన్‌ను ప్రత్యేక శీతల గదిలో భద్రపర్చాలి. సరైన వసతులు లేకపోవడంతో వ్యాక్సినేషన్ స్థానిక సీహెచ్‌సీలో ఇస్తున్నారు. దీనికితోడు ఇక్కడ పని చేయాల్సిన వైద్య సిబ్బంది కొంత మంది వేరే ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అదే పక్కా భవనం వస్తే నాలుగు బెడ్లతోపాటు అనేక సేవలు అందనున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

పీహెచ్‌సీ భవనం పనులు కొనసాగుతున్నాయి. తాత్కాలికంగా రెండు గదుల్లో రోగులకు సేవలు అందిస్తున్నాం. దీంతో రోగులకు ఇబ్బందులు కలుగుతున్న మాట వాస్తవమే. స్త్రీలకు, గర్భిణులకు సమస్య అవుతుంది. ఈ విషయాలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఈ కేంద్రం పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేచ్చేందుకు ప్రయత్నం చేస్తాం.

- సీహెచ్ కాటంరాజు, మండల మెడికల్ ఆఫీసర్

పూర్తిస్థాయి పనులు జరుగడంలేదు

భవనం లోపల పనులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నరు. భవనం మొత్తం పూర్తయినట్లు కనిపిస్తున్నా.. లోపల పూర్తిస్థాయి పనులు జరుగలేదు. మరికొన్ని రోజులు గడిస్తే ఉన్న భవనం కూడా శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉంది. ఇకనైనా పనులు పూర్తి చేసి వైద్య సేవలు అందించాలని కోరుతున్నం.

- నిమ్మల శేఖర్‌గౌడ్, దామెర గ్రామస్తుడు

ఎమ్మెల్సీ మెప్పు కోసం విద్యార్థుల కడుపులు మారుస్తారా?

- బీఆర్ఎస్ పార్టీ రాజాపేట మండలాధ్యక్షుడు తిరుమలేశ్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుమలేశ్

రాజాపేట, డిసెంబర్ 15 : స్థానిక గురుకుల పాఠశాలలో శనివారం డైట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మన్ననలు పొందేందుకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమయానికి పెట్టకుండా వారి కడుపులు మారుస్తారా? అని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అతిథులపై ఉన్న దృష్టి విద్యార్థులపై లేదన్నారు. భోజనం పెట్టకపోవడంతో ఆరో తరగతి విద్యార్థి ధనుష్ స్పృహ తప్పి పడిపోయి దవాఖానలో చేరాడని తెలిపారు. ఇందుకు కారణమైన ప్రిన్సిపాల్ సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ వస్తున్నాడని బయటి నుంచి వంట వారిని తీసుకొచ్చి వంటలు చేయించారన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు లోపలికి వస్తే వసతి, మధ్యాహ్న భోజనంలో లొసుగులు బయటపడుతాయని గేటుకు తాళం వేసి అడ్డుకున్నారని తెలిపారు. అధికారిక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పొగడ్తలతో రాజకీయ ప్రసంగాలు చేయడం, ప్రజాప్రతినిధులకు లోకువగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, నాయకులు చింతలపూరి వెంకటరామిరెడ్డి, ఎర్రగోకుల జశ్వంత్, బెడిద వీరేశం, గుర్రం నరసింహులు, మధుసూదన్‌రెడ్డి, రాజు, ఉప్పలయ్య, లక్ష్మణ్, రాజు, బాబు పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలకు ప్రమాదం

- రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న బీజేపీ సర్కారు
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

చౌటుప్పల్, డిసెంబర్ 15 : కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం, ఒకే ఎన్నిక తీసుకురావాలని చూస్తుందని, దాంతో ప్రాంతీయ పార్టీలకు ప్రమాదం పొంచి ఉందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో జరుగుతున్న సీపీఎం జిల్లా మూడో మహాసభల సందర్భంగా ఆదివారం బస్టాండ్ ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహించారు. సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జమిలీ ఎన్నికల వల్ల ఖర్చు తగ్గుతుందని చెప్పడం సరికాదన్నారు. దేశమంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే కోట్లు కూడబెట్టిన అధికార పార్టీలకే లాభమని పేర్కొన్నారు. కేంద్రంలో మూడోసారి మోదీ సొంత బలంతో కాకుండా ప్రాంతీయ పార్టీల మీద ఆధారపడి అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. జమిలీ ఎన్నికలు తెస్తే ఇలాంటి పార్టీలకు ప్రమాదమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తుందని, వివిధ సంఘాల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. 4 లేబర్ కోడ్‌లు తెచ్చి సంఘాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని మార్చి దేశంలో హిందువులు తప్ప ఎవరూ లేరని చేయాలని చూస్తుందన్నారు. బడా కంపెనీల కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని, దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతుందని విమర్శించారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై బీజేపీ, కాంగ్రెస్ ఒకరి మీద ఒకరు నెట్టివేసుకుంటూ పట్టించుకోవడం లేదన్నారు. మిగతా నాలుగు రహదారులకు 40 కిలోమీటర్లు తీసుకొని, ఇక్కడ 28కి పరిమితం చేయడం సరికాదన్నారు. కొన్ని పరిశ్రమల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు పని చేయవద్దని సూచించారు. ఇక్కడి పరిశ్రమల కాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. కాసుల కక్కుర్తి కోసం పాలకులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అంతకుముందు 65వ జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని, బహిరంగ మార్కెట్ ప్రకారం భూములకు ధర ఇప్పించేలా కృషి చేయాలని బాధితులు బీవీ రాఘవులుకు వినతి పత్రం అందజేశారు.

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఓట్లు, సీట్లు కావు.. పోరాటమే మన మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.45లక్షల కోట్ల సంపదను కార్పొరేట్ చేతుల్లో పెట్టి దుర్మార్గ చర్యలకు పాల్పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పక్కన పెట్టి సొంత ఎజెండా కోసమే పనిచేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలను పూర్తిగా అమలు చేయకుండా ఏడాది పండుగ జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, జిల్లా నాయకులు ఎండీ పాషా, బూర్గు కృష్ణారెడ్డి, బండారు నర్సింహ, అవ్వారి రామేశ్వరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు : కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 15 : టీజీపీఎస్సీ గ్రూప్ – 2 పరీక్షల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్ – 2 పరీక్ష సందర్భంగా జిల్లా అధికారులు విధులు నిర్వహిస్తున్నందున కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు గమనించి కలెక్టర్ కార్యాలయానికి రావద్దని సూచించారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

తుర్కపల్లిలో రైతు సేవ దుకాణ సముదాయ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

తుర్కపల్లి, డిసెంబర్ 15 : రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో రూ.32లక్షలతో నిర్మించిన రైతు సేవా దుకాణ సముదాయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే సీజన్ నుంచి పంటల బీమా, రైతు బీమా అందిస్తామన్నారు. పీఏసీఎస్ సిబ్బంది అందుబాటులో ఉంటూ రైతులకు త్వరితగతిన వ్యవసాయ రుణాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ ముత్యాలు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శంకర్‌నాయక్, నాయకులు రాంరెడ్డి, నరసింహారెడ్డి, రాజయ్య, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా నిలుస్తాం

రాజాపేట : తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు అండగా నిలుస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన బర్ల బాలనర్సయ్య, రేణుక దంపతులు మృతి చెందగా అనాథలుగా మారిన వారి ఇద్దరు పిల్లలను ఆదివారం ఆయన పరామర్శించారు. బీర్ల ఫౌండేషన్ తరపున తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. డీఈఓకు ఫోన్ చేసి పిల్లలను తక్షణమే యాదగిరిగుట్ట హాస్టల్‌లో సీట్లు కేటాయించాలని సూచించారు.

'గ్రామ పంచాయతీలుగా పునరుద్ధరించండి'

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ యాదగిరి

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 15 : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్, రేవణపల్లి గ్రామాలను గ్రామపంచాయతీలుగా పునరుద్ధరించాలని నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ తడక యాదగిరి, స్థానిక కౌన్సిలర్ కొంగరి కృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ఏర్పాటు చేసిన పోచంపల్లి మున్సిపాలిటీని రద్దు చేయాలన్నారు. మున్సిపాలిటీలో పన్నులు పెరిగాయని, ఉపాధి హామీ పథకం లేకపోవడంతో పేదలు నష్టపోతున్నారని, గ్రామ ఉనికిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భూదానోద్యమానికి నాంది పలికి, ఇక్కత్ పట్టు చీరలకు నిలయంగా పోచంపల్లి చేనేత పరిశ్రమ తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా నిలిచిందన్నారు. యునెస్కో ద్వారా ఉత్తమ టూరిజం గ్రామంగా ప్రకటించబడిన పోచంపల్లి అసిథత్వం గ్రామపంచాయతీలోనే ఉందని పేర్కొన్నారు. పోచంపల్లి, రేవణపల్లి ముక్తాపూర్ గ్రామాలను మున్సిపాలిటీగా మార్చడంతో ప్రజలు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పోచంపల్లి మున్సిపాలిటీని రద్దు చేసి గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచులు దారెడ్డి మల్లారెడ్డి, మునుకుంట్ల బాలచంద్రం గౌడ్, జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు భారత లవకుమార్, చిక్క కృష్ణ, పట్నం కృష్ణకుమార్, చింతకింది రమేశ్, కొండమడుగు రాజు, డబ్బికార్ సాహేశ్‌కుమార్, నాయకులు కొండమడుగు రోషన్, పురుషోత్తం, రాజిరెడ్డి, నరేందర్, నరసింహ, భీమయ్య, రాంరెడ్డి, మహేశ్, పాండు, లింగస్వామి, బాలయ్య, మల్లేశ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బీబీనగర్, డిసెంబర్ 15 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ ఎన్.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని వినాయక్‌నగర్, మేడిపల్లికి చెందిన షేక్ అవైస్ (24) ఆదివారం ఉదయం 4గంటల సమయంలో హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై కారులో జనగాం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. బీబీనగర్ మండలంలోని కొండమడుగు మెట్టు ఆవరణలో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ముందు వెళ్లున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో అవైస్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

అనారోగ్యంతో బస్టాండ్‌లో వ్యక్తి మృతి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 15 : భువనగిరి బస్టాండ్‌లో ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతిచెంది ఉన్నాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మేడిపల్లిలో నివాసం ఉండే పారునంది రమేశ్ (50)కు, భార్య ధనలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, రమేశ్ అనారోగ్య కారణంతో రెండేండ్లుగా కుటుంబ సభ్యులను పట్టించుకోకుండా వేరుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం భువనగిరి బస్టాండ్‌లోని గజ్వేల్ బస్సులు నిలిపే ప్లాట్‌ఫామ్ ముందున్న బెంచీపై పడిపోయి ఉన్నాడు. ఎంత సేపటికీ లేవకపోవడంతో ప్రయాణికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి అతనిని భువనగిరి ఏరియా దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న ఆధార్ కార్డుతో కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొని వారికి తెలియజేశారు. రమేశ్ భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 15 : మండల కేంద్రానికి చెందిన చేపూరి సాయిరాం తండ్రి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. తండ్రిని కోల్పోయిన స్నేహితుడికి 2017 – 18 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం రూ.20,500 ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా గ్రామంలోని ఓల్డ్‌సిటీ ప్రాంతానికి చెందిన స్నేహితులు రూ.30 వేలు, బియ్యం అందజేసి సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్, నరేశ్, శ్రీనివాస్, శ్రీశైలం, అశోక్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

భూదాన్ పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన బుర్రి కృష్ణారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. భారత యువజన సంఘం ప్రతినిధులు ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శనిగరం పాండు, ప్రతినిధులు సుర్వి రాము, చింతల ఉపేందర్, కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్, శివ, షబ్బీర్ పాల్గొన్నారు.

యువజన క్రీడల విజేతలకు బహుమతుల ప్రదానం

క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న పీడీ నాగయ్య

ఆలేరు టౌన్, డిసెంబర్ 15 : బ్లాక్ స్థాయి యువజన క్రీడల ముగింపులో భాగంగా ఆలేరు జడ్పీహెచ్ఎస్ మైదానంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు పీడీ పూల నాగయ్య ఆదివారం బహుమతులు అందజేశారు. కబడ్డీ మొదటి బహుమతి ఫ్రెండ్స్ క్లబ్ (కొల్లూరు), ద్వితీయ మంతపురి గ్రామం, వాలీబాల్ మొదటి బహుమతి కేసర్ యూత్ (వంగపల్లి), ద్వితీయ ఫ్రెండ్స్ క్లబ్ (ఆలేరు), 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం కర్ణాకర్, ద్వితీయ రాము, లాంగ్ జంప్ ప్రథమ కర్ణాకర్, ద్వితీయ భూమేశ్, షార్ట్‌పుట్ ప్రథమ పూల చంద్రకుమార్, ద్వితీయ వినయ్, డిస్కస్‌త్రో ప్రథమ సాయికుమార్, ద్వితీయ బహుమతి వినయ్ గెలుచుకున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయించాలని వినతి

ప్రభుత్వ విప్ ఐలయ్యకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచులు

తుర్కపల్లి, డిసెంబర్ 15 : పెండింగ్ బిల్లులు విడుదల చేయించాలని కోరుతూ పలువురు మాజీ సర్పంచులు ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు తుర్కపల్లిలో వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో మాజీ సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పోగుల ఆంజనేయులు, భాస్కర్‌నాయక్, బాలకృష్ణ పాల్గొన్నారు.

పత్తి మిల్లు పరిశీలన

ఆలేరు టౌన్ : అగ్ని ప్రమాదానికి గురైన శ్రీమల్లికార్జున స్వామి కాటన్ మిల్లును ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదివారం సందర్శించి ప్రమాదానికి గల కారణాలను మిల్లు యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.2కోట్ల విలువైన పత్తి అగ్నికి దహనం అయ్యిందని యాజమాన్యం తెలిపింది. సుమారు 500 క్వింటాళ్ల పత్తి నష్టం వాటిల్లిందన్నారు.

'తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి'



నూతన జేఏసీ నాయకులకు నియామక పత్రాలు అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు

వలిగొండ, డిసెంబర్ 15 : తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిష్టఫర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జేఏసీ నాయకులుగా నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేశారు. సమావేశంలో మంటి రమేశ్, గాజుల యాదగిరి, మంటి లింగయ్య, జోగు చిన్న యాదయ్య, వెంకటేశం, నరసింహరాజు పాల్గొన్నారు.

మహాసభలకు వెళ్లే ముందు అనాజీపురంలో జెండావిష్కరణ చేస్తున్న సీపీఎం నాయకులు

జిల్లా మహాసభలకు తరలిన సీపీఎం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 15 : చౌటుప్పల్‌లో జరుగుతున్న సీపీఎం జిల్లా మహాసభలు, బహిరంగ సభకు ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సీపీఎం నాయకులు పార్టీ జెండాలను ఎగురవేశారు.

కుర్రారంలో ఉచిత వైద్య శిబిరం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్

రాజాపేట, డిసెంబర్ 15 : మండలంలోని కుర్రారంలో చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భువనగిరి ఆర్కే హాస్పిటల్ వారు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు, ఈ సందర్భంగా 279 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ పాండవుల కనకలక్ష్మి, బూరుగు రమేశ్, చంద్రయ్య, రవీందర్‌రెడ్డి, భాస్కర్, ఐలయ్య, శ్రీనివాస్, డాక్టర్ జ్ఞానేందర్ పాల్గొన్నారు.

తైబజార్‌లో సమస్యల తిష్ట

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 15 : మండల కేంద్రంలోని బక్క మల్లయ్యకుంటలో ప్రతి సోమవారం జరిగే అంగడి ప్రదేశంలోని తైబజార్‌లో సమస్యలు తిష్ట వేశాయి. అంగడి రోజు వివిధ జిల్లాలు, మండలాల నుంచి వందల సంఖ్యలో చిరు వ్యాపారులు ఇక్కడికి వచ్చి కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువులు, సరుకులు విక్రయిస్తుంటారు. గుంతలమయంగా ఉన్న తైబజార్ వర్షం పడినప్పుడు బురదమయం కావడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేకుల షెడ్లు లేకపోవడంతో ఎండలోనే గొడుగులు పెట్టుకొని వ్యాపారం సాగిస్తున్నారు. అంగడి నిర్వాహకులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.